క్లుప్తంగా

14న క్యాంపస్ ఇంటర్వ్యూలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్‌లోని సెయింట్ పాల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోనే రెండవ అతిపెద్ద ఫార్మా దిగ్గజం దివీస్ లాబోరేటోరీస్ చౌటుప్పల్.. క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అష్యూరెన్స్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివిధ కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ


ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

యాచారం: మండల పరిధిలోని చింతుల్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తన పాదయాత్రలో పాఠశాల విద్యార్థులకు గ్లాసులు, ప్లేట్లు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు స్థానిక సర్పంచ్ సబిత, మాజీ సర్పంచ్ సత్యపాల్, నాయకులు రమేష్, శేఖర్, ఈశ్వర్, విద్యార్థులకు సామగ్రిని పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించండి

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్ 21వ వార్డులో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కొత్తకుర్మ కార్తీక్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ముఖ్యంగా శ్రీ సూర్య సాయినగర్, జనచైతన్య కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం కొరకు హెచ్‌ఎండీఏ నిధులను కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యేని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే పనులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు కార్తీక్ తెలిపారు. వార్డు అధ్యక్షులు యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గునుగల్ మాజీ సర్పంచ్ మృతి

యాచారం: మండల పరిధిలోని గునుగల్ మాజీ సర్పంచ్ బి.రఘునాథ్‌రెడ్డి (90) బుధవారం మృతి చెందాడు. గునుగల్ గ్రామానికి రఘునాథ్‌రెడ్డి మూడు పర్యాయాలు(14 ఏళ్లు) సర్పంచ్‌గా సేవలు అందించారు. గునుగల్ గ్రామంలోని ఆయన నివాసంలో రఘునాథ్‌రెడ్డి మృతదేహానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పూలమాలలేసి నివాళులర్పించారు. రఘునాథ్‌రెడ్డి సేవలను ఆయన కొనియాడారు.

పడకల్‌లో డ్రైనేజీల నిర్మాణం చేపట్టండి: సీపీఎం

తలకొండపల్లి: పడకల్ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని సీపీఎం సీనియర్ నాయకులు పెంటయ్య, రమేశ్ కోరారు. మండల పరిధిలోని పడకల్‌లో బుధవారం పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో మోరీల సమస్య ప్రధానంగా ఉందని స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. మోరీలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఫలితంగా దుర్వాసనతో దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించి ఇబ్బందులను తొలగించాలని వారి దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను ప్రజాప్రతినిధుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్దయ్య, మాదవులు, సత్తయ్య, వెంకట్‌రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీడీఎంఏ ముట్టడికి తరలిన కార్మికులు

తుర్కయంజాల్: తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు తుర్కయంజాల్ నుంచి నగరంలోని సీడీఎంఏ కార్యాలయం ముట్టడికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్‌ఎంఆర్, ఫిక్స్‌డ్ పే తదితర సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. మున్సిపల్ ప్రధాన కార్యదర్శి నగేష్, నాయకులు యాదగిరి, నవీన్, మహేష్, రవి, చందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారానికి 10వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మండల ఏర్పాటుపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. మండల ఏర్పాటుకు గట్టు ఇప్పలపల్లికి అన్ని అర్హతలున్నాయినినారు. ప్రభుత్వం మండల ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు దీక్షలు కొనసాగుతయన్నారు.

రైతులకు క్షమాపణ చెప్పాలి


ఇబ్రహీంపట్నం: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, నాయకులు


ఆమనగల్లు: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


అబ్దుల్లాపూర్‌మెట్: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వ్యవసాయ రంగానికి 3 గంటల ఉచిత విద్యుత్ సరిపోతుందంటూ వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణలు చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రేవంత్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేసారు. కాంగ్రెస్ పార్టీవి రైతు వ్యతిరేక విధానాలన్నారు. కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి వెంటనే ఉచిత విద్యుత్‌పై వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. - సాక్షి, నెట్‌వర్క్

విద్యాసంస్థల బంద్ విజయవంతం


ఆమనగల్లు: పాఠశాలను మూసివేయిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు


హయత్‌నగర్: పాఠశాలను బంద్ చేయిస్తున్న నాయకులు

ఆమనగల్లు: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆమనగల్లు పట్టణంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఆమనగల్లు పట్టణంలోని పలు పాఠశాలలను ముందుగానే మూసివేశారు. తెరిచిన కొన్ని పాఠశాలలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మూసివేయించారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి అరుణ్, నాయకులు ఆదర్శ్, పవన్, వినోద్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి మండలంలో..

తలకొండపల్లి: ఎస్‌ఎఫ్‌ఐ, వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయ్యింది. మండల కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు ఆదర్శ్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేయించారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల ఉపాధ్యక్షుడు పవన్, వినోద్, సురేశ్, అరుణ్ పాల్గొన్నారు.

యాచారం మండలంలో..

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో యాచారం మండలంలో చేపట్టిన పాఠశాలల బంద్ విజయవంతం అయ్యింది. ఆ సంఘం నాయకులు పలు పాఠశాలలను బంద్ చేయించారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు విప్లవ్‌కుమార్, నాయకులు వికాస్, వంశీ, భగత్, శేఖర్, రామ్, చరణ్ పాల్గొన్నారు.

హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో..

హయత్‌నగర్: ప్రభుత్వ విద్యాసంస్థలలో సమస్యలు పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు బుధవారం బంద్ పాటించాయి. ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, సహాయ కార్యదర్శి వంశీవర్ధన్‌రెడ్డి, మండల నాయకులు ఉపేందర్, భాను, అరుణ్‌గౌడ్, పీడీఎస్‌యూ నాయకులు మహేశ్, వరుణ్, యశ్వంత్, శివ తదితరులు పాల్గొన్నారు

మంచాల మండలంలో..

మంచాల: మంచాల మండలంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాలల బంద్ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. బుధవారం ఉదయం గ్రామాల్లో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాఠశాలల వద్దకు చేరుకొని తరగతులు నిర్వహించకుండా బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మహేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్,చాంద్ పాష, కిరణ్,గణేష్,బన్నీ, నాగరాజు, వెంకటేష్,నితిన్ ,రవి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం మండల పరిధిలో..

ఇబ్రహీంపట్నం: ఎస్‌ఎఫ్‌ఐ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలో పాఠశాలల బంద్ విజయవంతమైంది.ఆ సంఘం మండల అధ్యక్షులు తరంగ్, కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు వినోద్, వంశీ, లక్ష్మణ్, భానువర్షిత్, మనోహర్, విక్రమ్,వినయ్‌లు పాల్గొన్నారు.

యార్డులో మరో 17 మడిగెల నిర్మాణం

మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో మరో 17 మడిగెలను నిర్మించనున్నట్లు చైర్మన్ ఎర్పుల చంద్రయ్య తెలిపారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని కార్యాలయంలో నిర్వహించిన మార్కెట్ కమిటీ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడు నిర్మిస్తున్న 17 దుకాణాల సముదాయంతోపాటు మరో 17 దుకాణాలను నిర్మించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా మార్కెట్ యార్డుకు నూతన కార్యాలయ భవన నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ మేరకు నిర్మాణ అంచనాల వ్యయంపై సభ్యులు చర్చించారు. మార్కెట్ యార్డుకు సంబంధించి అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి సంతోష్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో చైర్మన్ చంద్రయ్య, సభ్యులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్'ను పురస్కరించుకుని ఎన్‌హెచ్‌ఏఐ వారు దేశ వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, సిబ్బందితో కలిసి రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ ఆర్‌ఈ గంగాధర్, ఎన్‌హెచ్‌ఏఐ కాంట్రాక్టర్లు సర్వేశ్, అమర్త్యసేన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు అశోక్ తదితరులు ఉన్నారు.

లీకేజీలపై అప్రమత్తత

చెరువులు, కుంటలపై ఇరిగేషన్ శాఖ స్పెషల్ డ్రైవ్

- మండలంలోని 116 చెరువులు, కుంటల పరిశీలన
- తెట్టేకుంట మరమ్మతులకు రూ.23 లక్షల నిధుల మంజూరు
- ఎఫ్‌టీఎల్, శిఖం భూముల కబ్జాపై ఉక్కుపాదం

యాచారం: చెరువులు, కుంటల మరమ్మతులపై ఇరిగేషన్ శాఖ దృష్టి పెట్టింది. సంవృద్ధి వర్షాలతో రెండేళ్లుగా చెరువులు, కుంటల్లో నీళ్లు ఫుల్‌గా ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా మళ్లీ వర్షాలు కురిస్తే వరదనీరు వచ్చి చెరువులు, కుంటలు నిండే అవకాశం ఉంటుందనే ఉద్దేశ్యంతో ఇరిగేషన్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామాలు, 18 అనుబంధ గ్రామాల్లో 116 చెరువులు, కుంటలు ఉన్నాయి. మండలంలో తాడిపర్తిలోని బంధం చెరువు, కుర్మిద్దలోని పెద్ద చెరువు, తక్కళ్లపల్లి గ్రామంలోని చెన్నారెడ్డి చెరువు, చింతపట్లలోని లక్ష్మణ్ చెరువు, మల్కీజ్‌గూడలోని మగ్దుంఅలీ చెరువు, నల్లవెల్లిలోని నల్లవెల్లి చెరువులు 25 ఎకరాల నుంచి 50 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్నాయి. ఏళ్లకింద నిర్మించిన చెరువులు కావడంతో తూములను అధికారులు పరిశీలించనున్నారు. రెండేళ్ల కింద భారీ వర్షాల సమయంలో తాడిపర్తిలోని బంధం చెరువు, నక్కర్తమేడిపల్లిలోని ఊరచెరువు, ఎక్వ చెరువు, చింతపట్లలోని లక్ష్మణ్ చెరువుల తూముల వద్ద లీకేజీలు ఏర్పడి నీరంతా వృథాగా పోయింది. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని ఇరిగేషన్ శాఖ లీకేజీలను ముందే పసిగట్టి మరమ్మతు పనులను ముందే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటోంది.

చెరువులు, కుంటల తనిఖీలు..

వర్షాకాలం దృష్ట్యా లీకేజీలను పసిగట్టడం కోసం ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలన పేరుతో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ యాచారం డీఈఈ మంజుల ఆధ్వర్యంలో సిబ్బంది నిత్యం మండలంలోని ఏదోఒక గ్రామంలో పర్యటిస్తూ స్థానిక రైతులతో చర్చిస్తున్నారు. వరద నీరు వచ్చిన సమయంలో లీకేజీలు ఏర్పడ్డాయా, తూముల పరిస్థితి, కట్టల్లో నాణ్యతపై ఆరా తీస్తున్నారు. స్థానిక రైతుల ఫిర్యాదుల మేరకు ఆయా చెరువులు, కుంటల తూములు, కట్టలకు మరమ్మతు చేసే విధంగా కృషి చేస్తున్నారు. ఏడాది కిందనే తాడిపర్తి గ్రామంలోని బంధం చెరువు లీకేజీలు, కట్ట మరమ్మతులకు రూ.4 లక్షల ఖర్చు చేశారు. తాజాగా గతేడాది కురిసిన భారీ వర్షాలకు గండిపడిన తాడిపర్తి గ్రామంలోని తెట్టేకుంటకు మరమ్మతుల నిమిత్తం రూ.23 లక్షల నిధులు మంజూరు చేశారు. పెద్ద చెరువులే కాకుండా ఆయా గ్రామాల్లో ఉన్న చిన్నకుంటల మరమ్మతులను సైతం చేసే విధంగా ఇరిగేషన్ శాఖ దృష్టి పెట్టింది.


మంతన్‌గౌరెల్లిలో చెక్‌డ్యాం తూమును పరిశీలిస్తున్న అధికారులు

అక్రమణలపై నిఘా..

మహానగరానికి సమీపంలో ఉన్న యాచారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇరిగేషన్ శాఖ.. శిఖం భూముల అక్రమణలపై నిఘా పెట్టింది. కొన్ని గ్రామాల్లో చెరువులు, కుంటల సమీపంలోనే రియల్ వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘించి వెంచర్లు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు వచ్చే దారులను కూడా రియల్ వ్యాపారులు మూసేశారు. గతేడాది నందివనపర్తి గ్రామంలో ఓ రియల్ వ్యాపారి మూసేసిన కాల్వ భారీ వర్షాల సమయంలో వరద నీరు పారడంతో వెలుగులోకి వచ్చింది. శిఖం భూములను ఆక్రమించడం, ఎఫ్‌టీఎల్ దాటి కూడా అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు గుర్తించారు. అలాంటి ఆక్రమణలను ముందే గుర్తించి చర్యలు తీసుకుంటామని అధికారుల తెలిపారు.

'సాగునీటి' కమిటీలు వేయాలి



ప్రభుత్వం తక్షణమే సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి. చెరువులు, కుంటల మరమ్మతుల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులను భాగాస్వామ్యం చేయాలి. పర్యవేక్షణతోనే లీకేజీలు కాని, ఆక్రమణలు కానీ అరికట్టవచ్చు. రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. మరమ్మతులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలి.

– జోగిరెడ్డి, రైతు, నందివనపర్తి

మరమ్మతులు చేపట్టాలి



తాడిపర్తి గ్రామంలోని తెట్టే కుంటల్లోకి గతంలో కురిసన భారీ వర్షాలకు వరద నీరు భారీగా రావడంతో కట్ట మధ్యలో తెగిపోయింది. వాటి మరమ్మతులకు రూ.23 లక్షల నిధులు మంజూరైనట్లు ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలి. లేకపోతే మళ్లీ వర్షాలు కురిస్తే నీరు అంతా వృథాగా పోతుంది.

– బావయ్య, ఎంపీటీసీ సభ్యుడు, తాడిపర్తి

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం



లీకేజీలు, కట్టలు తెగిన చెరువులను గుర్తించేందుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నాం. నిత్యం ఏదో ఒక గ్రామంలో పర్యటిస్తున్నాం. స్థానిక రైతులు కూడా చెరువులు, కుంటల పరిస్థితులపై సమాచారం అందించాలి. ఎఫ్‌టీఎల్ ఆక్రమణ, శిఖం భూముల కబ్జాపై నిఘా పెట్టాం. తెట్టెకుంట మరమ్మతులకు రూ.23 లక్షల నిధులు మంజూరయ్యాయి.

– మంజుల, ఇరిగేషన్ డీఈఈ, యాచారం

బీఆర్‌ఎస్‌లోకి భీరెండ్డి

- పెదంబర్‌పేట వైస్ చైరపర్సన్ చామ సంపూర్ణ కూడా!
- వారి బాటలోనే పలువురు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, కీలక నేతలు

తుర్కయంజాల్: నియోజకవర్గంలోనే సుమారు 50వేల ఓట్లతో కీలకమైన తుర్కయంజాల్ మున్సిపాలిటీపై బీఆర్‌ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. మున్సిపాలిటీతో పాటు, నియోజకవర్గంలో ఓట్లను సైతం ప్రభావితం చేయగలిగే స్థాయిలో ఉన్నటువంటి మాజీ ఎంపీపీ రొక్కం భీంరెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, మాజీ సర్పంచ్‌లు, పలువురు నాయకులతో ఎమ్మెల్యే మంచిరెడ్డి ఇప్పటికే చర్చలు జరపగా.. తాజాగా మంగళవారం ఓ ఫంక్షన్ హాల్‌లో మరోమారు చర్చలు జరిపారు. దీంతో ఎన్నో రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడినట్లయ్యింది. గురువారం తుర్కయంజాల్‌లో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సమక్షంలో వారంతా బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. రేపటి చేరికలతో నియోజకవర్గంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కడం ఖాయంగా కనిపిస్తోంది. ఈనెల 18వ తేదీ తర్వాత మంత్రి కేటీఆర్ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు సమాచారం. ఆ పర్యటనలో కూడా ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు ఉంటాయని నేతలు చెబుతున్నారు.

కాంగ్రెస్‌కు హ్యాండ్ ఇవ్వనున్న చామ!

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం వైస్ చైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు చామ సంపూర్ణ విజయశేఖర్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు మరో ఇద్దరు కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరుతారంటూ స్థానికంగా టాక్ నడుస్తోంది. ఇప్పటికే ఆమె స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డితో పార్టీలో చేరికపై మంతనాలు జరిపినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యత ఇవ్వకపోవడంతోనే చైరపర్సన్ కారెక్కనున్నట్లు సమాచారం. అయితే పార్టీ ఎప్పుడు మారుతారో అనే విషయంపై ఇంకా స్పష్టత లేదు.

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి

జెడ్పీటీసీ మర్రి నిత్యారెడ్డి

మంచాల: మహిళలు స్వశక్తితో ఎదగాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి అన్నారు. మంచాల మండలంలోని దాద్‌పల్లి గ్రామంలో దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రం రంగారెడ్డి జిల్లా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం జెడ్పీటీసీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. పురుషులతో పాటు మహిళలు కూడా తమదైన విధానంలో కష్టపడి పనిచేయాలన్నారు. ప్రధానంగా స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకుపోవాలన్నారు. టైలరింగ్‌లో 45 రోజులు, బ్యూటీషియన్‌లో 30 రోజులు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు కూడా ఇస్తారని తెలిపారు. గ్రామంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిలుకూరు మహిళా ప్రాంగణం డిస్ట్రిక్ట్ మేనేజర్ శైలకుమారి, ఇన్‌స్పెక్టర్ గీత, సర్పంచ్ దోర్జి, ఉప సర్పంచ్ శేఖర్, అంగన్‌వాడీ టీచర్ పద్మ, ట్రైనర్లు జ్యోతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కేసీఆర్

విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట కాంగ్రెస్ నేతల నిరసన


ఆమనగల్లు: కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ పేరుతో సీఎం కేసీఆర్ రైతులను మోసం చేస్తున్నారని పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలోని విద్యుత్ ఏడీఈ కార్యాలయం ఎదుట బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములు, నాయకులు ఖలీల్, కృష్ణనాయక్, శ్రీశైలం, అలీం, ఖాదర్, జహంగీర్, జవహర్‌లాల్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించారు..

ఇబ్రహీంపట్నం: ఉచిత విద్యుత్ అంశంపై టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మాట్లాడిన అంశాలను బీఆర్‌ఎస్ పార్టీ వక్రీకరిస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేశారు. జెడ్పీటీసీ మహిపాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం: సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఉచిత విద్యుత్ ఘనత కాంగ్రెస్‌దే..

కడ్తాల్: ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆ పార్టీ పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు హీరాసింగ్, బాల్‌రాజ్, సత్యం, మల్లేశ్‌గౌడ్, జవహర్‌లాల్, యాదయ్య, భరత్, మల్లయ్య, ఇమ్రాన్, తులసీరాం ఉన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

కడ్తాల్: సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారానికి ఏడవ రోజుకు చేరుకుంది. జీవో 60 ప్రకారం ప్రతి కార్మికుడి వేతనాలు పెంచాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేది లేదని కార్మికులు తేల్చిచెప్పారు. కార్యక్రమంలో కార్మికులు.. నరేశ్, భారతమ్మ, రాములమ్మ, వెంకటమ్మ, రవి, సుగుణమ్మ, మరియమ్మ, లక్ష్మీ, సరస్వతీ, చంద్రకళ, హంసమ్మ ఉన్నారు.

మంచాలలో అర్ధనగ్న ప్రదర్శన..

మంచాల: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు బుధవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సమ్మెకు సీపీఎం జిల్లా నాయకుడు పగుడాల యాదయ్య మద్దతు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పాండు, మండల అధ్యక్ష, కార్యదర్శి ఖాజాపాష, భాస్కర్, నాయకులు శంకరయ్య, రవి, జగన్, సురేష్, మాధవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట..

తలకొండపల్లి: సమస్యల సాధన కోసం పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయ ఎదుట నిర్వహిస్తున్న నిరసనకు బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ బుధవారం మద్దతు తెలిపారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం కార్మికుల అధ్యక్షురాలు యాదమ్మ, కోకన్వీనర్ రవలి, సభ్యులు యాదమ్మ, భిక్షపతి, అలివేలు, జంగమ్మ, అలివేలు, సుగుణమ్మ, లక్ష్మీదేవి, రామచంద్రయ్య, పాండు, కార్మికులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి: కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అంతారం, వెంకటాపూర్‌తండా, పెద్దూర్‌తండా, దేవుని పడకల్ తదితర గ్రామాల్లో పర్యటించి వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులు, బీటీరోడ్లు, సీసీరోడ్లకు ప్రారంభోత్సవాలు, అదేవిధంగా గ్రామ పంచాయతీ భవనాలు, పల్లె దవాఖానాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తలకొండపల్లి మండల కేంద్రానికి నూతనంగా జూనియర్ కళాశాల మంజూరైందన్నారు. ఆమనగల్లు పట్టణానికి ఏడీఏ కార్యాలయం, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలు మంజూరయ్యాయన్నారు. త్వరలో ఆమనగల్లు పట్టణంలో మరిన్ని ప్రభుత్వ కార్యాలయాలు మంజూర్ కానున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక పార్టీ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు ఉచిత కరెంట్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

మండల కేంద్రంలోని రైతు వేదికలో 21 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. తలకొండపల్లి నుంచి ఆమనగల్లు వరకు రూ.37 కోట్లతో బీటీరోడ్డు ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, సర్పంచ్‌లు లలితమ్మ, శ్రీశైలం, రమేష్, తిరుపతి, చంద్రయ్య, రాజేందర్‌రెడ్డి, దశరథ్‌నాయక్, మల్లేశ్, రాజు పాల్గొన్నారు.